వృథా కాదు.. సైనికుల త్యాగం

క్లుప్తంగా

నాగాలమ్మకు పాలాభిషేకం



నాగాలమ్మకు పాలాభిషేకం చేస్తున్న భక్తులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరం సంతపేటలోని శ్రీనాగాలమ్మ ఆలయంలో శుక్రవారం ఆడినెల పూజలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం అభిషేక పూజలు చేసి అమ్మవారిని సుందరంగా అలంకరించారు. అనంతరం భక్తులకు చేతుల మీదుగా అమ్మవారికి పాలాభిషేకం చేయించారు. వారు భక్తి ప్రపత్తులతో అమ్మకు అభిషేకం చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే పలు అమ్మవారి ఆలయాల్లో కూడా ఆడి పూజలు విశేషంగా జరిగాయి.

ఎట్టకేలకు దుకాణాలు ఖాళీ



దుకాణాలు ఖాళీ చేయిస్తున్న అధికారులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరం జీవకారుణ్య సత్రానికి సంబంధించిన 8 దుకాణాలను ఎట్టకేలకు దేవదాయశాఖ అధికారులు ఖాళీ చేయించారు. శుక్రవారం రెవెన్యూ, పోలీసులు, దేవదాయశాఖ అధికారుల సమక్షంలో షాపులను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఈఓ తిమ్మారెడ్డి షాపు వివరాలను వెల్లడించారు. కొంతమంది 2002కు ముందు నుంచి ఈ షాపులను అనుభవిస్తున్నారు. రూ.1000 చొప్పున అద్దె చెల్లిస్తున్నారు. గతంలో పలుమార్లు ఖాళీ చేయాలని దేవదాయశాఖ అధికారులు నోటీసులు ఇచ్చారు. తర్వాత అద్దె ఇవ్వడం కూడా మానేశారు. దీంతో ఏపీ ఎండోమెంట్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. ఈ మేరకు ట్రిబ్యునల్ వెంటనే ఆ షాపులను ఖాళీ చేయించాలని ఉత్తర్వులు ఇచ్చిందని ఈఓ తెలిపారు. కార్యక్రమంలో ఏసీ ప్రసన్న లక్ష్మి, ఈఓలు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

మమ్మల్ని బీసీ జాబితాలో చేర్చరూ!

- మంత్రులకు పిరమళైకలర్ కులస్తుల వినతి

పలమనేరు: ఎన్నో దశాబ్దాల క్రితం రాష్ట్రంలో చిరు వ్యాపారాలు చేస్తూ స్థిరపడిన పిరమళైకలర్ కులస్తులను బీసీ జాబితాలో చేర్చాలని ఆ కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఈశ్వర్ తేవర్ శుక్రవారం అమరావతిలో రాష్ట్ర బీసీ, ఎస్టీ సంక్షేమ శాఖల మంత్రులు సవిత, సంధ్యారాణిని కోరినట్లు తెలిపారు. దీనిపై వారు సానుకూలంగా స్పందించారని, ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలోనే ఎక్కువ మంది ఉమ్మడి చిత్తూరు, నెల్లూరు, కృష్ణా, గుంటూరు జిల్లాలో ఉంటున్నారని మంత్రులకు వివరించామన్నారు. మంత్రులను కలిసిన వారిలో కుల సంఘ నేతలు సుప్ప దేవరక్రిష్ణ, నటరాజ్, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

పంటలు బాగా పండాలని..!



ప్రత్యేక పూజలు చేస్తున్న గ్రామస్తులు

పెద్దపంజాణి: మండలంలోని రాయలపేటలో శుక్రవారం అక్కదేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. వర్షాలు పుష్కలంగా కురిసి, పంటలు బాగా పండాలని, గ్రామం సుభిక్షంగా ఉండాలని ప్రతి ఏటా ఆషాఢ మాసంలో అక్కదేవతలకు పూజలు చేయడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో గ్రామస్తులంతా కలసి అక్కదేవతలకు పచ్చ వేశారు. పలు రకాల పుష్పాలు, పసుపు, కుంకుమ, గాజులు, నిమ్మకాయలు పెట్టి భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. పిండి వంటలను నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించారు. అన్న సమారాధన చేశారు.



చిత్తూరులోని గాంధీ విగ్రహం వద్ద ర్యాలీ చేస్తున్న మాజీ సైనికులు

- కార్గిల్ యుద్ధ వీరులకు నివాళులు
- మాజీ సైనికుల ఆధ్వర్యంలో విజయ్ దివస్ ర్యాలీ

చిత్తూరు కలెక్టరేట్: కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న సైనికుల త్యాగం ఎప్పటికీ వృథా కాదు అని జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారి విజయ్‌శంకర్‌రెడ్డి, మాజీ సైనికుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రామచంద్ర అన్నారు. శుక్రవారం మాజీ సైనికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్ దివస్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గాంధీ విగ్రహం నుంచి కొత్తబస్టాండ్ వద్ద ఉన్న సైనికుల అమరస్థూపం వరకు ర్యాలీ చేపట్టి జయహో జవాన్ అంటూ నినదించారు. అనంతరం అమరస్థూపం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ యుద్ధంలో భారత సైనికుల శౌర్యానికి, త్యాగానికి గుర్తు కార్గిల్ విజయ్ దివస్ అని అన్నారు. దేశానికి రక్షణ.. ప్రజలకు భరోసా ఇస్తున్న సైనికుల సేవలు ఎప్పటికీ మరువలేనివన్నారు. అనంతరం కార్గిల్ యుద్ధంలో వీరమరణం పొందిన సైనికులకు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మాజీ సైనికుల సంక్షేమ సంఘం నాయకులు సురేంద్రబాబు, పళని, రఘుపతి, రాజన్, శేఖర్, మాజీ సైనికుల కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

వీరజవాన్ల సేవలు మరువలేనివి

కార్గిల్ యుద్ధంలో పోరాడిన వీరజవాన్ల సేవలు ఎప్పటికీ మరువలేనివని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ జీవన జ్యోతి అన్నారు. శుక్రవారం ఆ కళాశాలలో కార్గిల్ విజయ దివస్ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థి దేశభక్తిని పెంపొందించుకోవాలని తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు సైన్యంలో చేరి దేశానికి సేవలందించాలని పిలుపునిచ్చారు. సేవాభారతి జిల్లా అధ్యక్షుడు రెడ్డెప్ప మాట్లాడుతూ కార్గిల్ యుద్ధం జరిగిన తీరు, సైనికులు ధైర్యసాహసాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం కార్గిల్ యుద్ధంలో వీరమరణం పొందిన సైనికులకు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ మీరాసాహెబ్, అధ్యాపకులు చెన్నకేశవులు, రాజేష్‌కుమార్, రెడ్డిబాషా పాల్గొన్నారు.



గుడిపాల: మాజీ సైనిక అధికారులను సన్మానిస్తున్న దృశ్యం



మాట్లాడుతున్న పీవీకేఎన్ కళాశాల ప్రిన్సిపల్ జీవనజ్యోతి

మాజీ సైనికులకు సన్మానం

గుడిపాల: కార్గిల్ యుద్ధంలో భారత్-పాకిస్తాన్‌పై విజయం సాధించి 25 ఏళ్లు కావొచ్చిన సందర్భంగా మాజీ సైనికులను ఘనంగా సన్మానించినట్లు మండల బీజేపీ సీనియర్ నాయకులు చిట్టిబాబు అన్నారు. శుక్రవారం కుప్పిగానిపల్లె గ్రామంలో కార్గిల్ యుద్ధంపై ప్రజల్లో అవగాహన కల్పించారు. శ్రీనగర్ నుంచి 205 కిలోమీటర్ల దూరంలో ఉన్న కార్గిల్ పట్టణం వద్ద 1999 మే నెల నుంచి జూలై వరకు భారత్-పాకిస్తాన్ మధ్య యుద్ధం జరిగిందన్నారు. ఈ యుద్ధంలో 527 మంది భారత సైనికులు వీరమరణం పొందారని, 1363 మంది సైనికులు క్షతగాత్రులు అయ్యారన్నారు. చివరకు భారత సైనికులు విజయం సాధించడంతో అప్పటి నుంచి విజయ్ దివస్‌ను ఏటా జూలై 26న జరుపుకుంటామన్నారు. కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న కుప్పిగానిపల్లె గ్రామానికి చెందిన విశ్రాంత సైనిక అధికారులు శేషాద్రికుమార్, సుబ్రమణ్యంను సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నందిమాధవ, చంద్రబాబు, రవి, సోమనాథ్, దేవ, సాయిప్రతాప్, శేఖర్‌తో పాటు మాజీ సైనికులు పాల్గొన్నారు.

ఇంటి వద్దే మెరుగైన వైద్యం



వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ అనూష

గుడిపాల: ఫ్యామిలీ డాక్టర్ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని బొమ్మసముద్రం డాక్టర్ అనూష అన్నారు. మండలంలోని రాసనపల్లె గ్రామంలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులకు వివిధ వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. అనంతరం ఇంటి వద్ద మంచాన పడిన రోగుల వద్దకు వెళ్లి వారికి కావాల్సిన వైద్యసేవలను అందజేశారు. గర్భిణులు, బాలింతలకు వైద్యసేవలు అందించి పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

డ్రైవర్ అరెస్టు

బంగారుపాళెం: బస్‌డ్రైవర్ మృతి కేసుకు సంబంధించి మరో బస్సు డ్రైవర్‌ను శుక్రవారం అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ నెల 22వ తేదీ రాత్రి మండలంలోని మహాసముద్రం టోల్‌ప్లాజా వద్ద ప్రైవేటు బస్సు డ్రైవర్లు ఘర్షణ పడి గుంటూరు జిల్లా పొన్నూరుకు చెందిన బస్సు డ్రైవర్ సుధాకర్‌ను మరో బస్సు డ్రైవర్ బస్సుతో ఢీకొట్టి చంపిన విషయం తెలిసిందేనన్నారు. ఈ కేసుకు సంబంధించిన ముద్దాయి విజయవాడకు చెందిన డ్రైవర్ శ్రీనివాసరావును బంగారుపాళెం పోలీస్‌స్టేషన్ సమీపంలో అరెస్టు చేసినట్లు తెలిపారు. అనంతరం చిత్తూరు కోర్టులో హాజరు పరచినట్లు చెప్పారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



పాలకలలో పొలంబడి కార్యక్రమం నిర్వహిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ

ఐరాల: ఖరీఫ్ సీజన్‌లో రైతులు పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులతో పాటు లాభాలను సాధించవచ్చని జిల్లా వ్యవసాయధికారి మురళీకృష్ణ సూచించారు. శుక్రవారం మండలంలోని పాలకలకు చెందిన రైతు రమేష్ సాగు చేసిన వేరుశనగ పంటలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు రసాయన ఎరువులు వాడకుండా ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా పంటలు పండించాలని చెప్పారు. అవసరం మేరకు కాషాయాలు వాడాలని తెలిపారు. ఏడీఏ ఉమా మాట్లాడుతూ అన్ని పంటలకు ఘన, జీవామృతం తయారు చేసుకోవాలన్నారు. భూమిలో ఘన జీవామృతం వేయడం వల్ల భూమిలో కర్బనశాతం పెరుగుతుందన్నారు. అన్ని రకాల పోషకాలు అందుబాటులోకి వస్తాయని సూచించారు. ఏపీసీఎన్ఎఫ్ మాస్టర్ ట్రైనర్ హనమంతు ద్రవ జీవామృతం తయారు చేసే విధానాన్ని డెమో ద్వారా రైతులకు తెలియజేశారు. పీఎండీఎస్ విత్తన కిట్ల ప్రాముఖ్యతను రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏఓ వరలక్ష్మి, మండల వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

29 నుంచి అరగొండలో ఆడికృత్తిక ఉత్సవాలు

తవణంపల్లె: మండలంలోని అరగొండలో వెలసిన శ్రీ స్వయంభువనేశ్వర కుమారస్వామి దేవస్థానంలో ఆడికృత్తిక ఉత్సవాలను నిర్వహిస్తామని కార్యనిర్వాహకులు తెలిపారు. 29న సోమవారం భరణి సందర్భంగా ఆలయంలో ఉభయదారులచే అభిషేకం, ఆరాధన జరుగుతుందన్నారు. ఉదయం 9 గంటలకు శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రమణ్య స్వామికి, శ్రీ కామాక్షాంబ, శ్రీ స్వయంభువనేశ్వర స్వామికి, శ్రీ సీతాకోదండరామస్వాముల వారికి, రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి వారికి కల్యాణాన్ని వైభవంగా నిర్వహిస్తామన్నారు. అదేవిధంగా భక్తులు భరణి కావళ్లు చెల్లిస్తారని చెప్పారు. 30వ తేదీన మంగళవారం ఆడికృత్తిక సందర్భంగా అభిషేకం, ప్రత్యేక పూజలు జరుగుతాయని తెలిపారు. భక్తుల కాలక్షేపం కోసం హరికథలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రాత్రి సమయంలో పుష్పపల్లకి సేవ ఉంటుందన్నారు. భక్తులు పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

వ్యాధుల నియంత్రణపై అవగాహన



బంగారుపాళెం: సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శివశంకర్

బంగారుపాళెం: గ్రామాల్లో వ్యాధులు వ్యాప్తి చెందకుండా ఆరోగ్య సిబ్బంది, గ్రామ కార్యదర్శులు సమన్వయంతో పని చేయాలని మండల అభివృద్ధి అధికారి శివశంకర్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ సమావేశ భవనంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా క్షేత్రస్థాయిలో సిబ్బంది పర్యవేక్షించాలన్నారు. డెంగీ, మలేరియా, డయేరియా వంటి వ్యాధులు వ్యాపించకుండా జాగ్రత్త పడాలని సూచించారు. అదనపు మలేరియా అధికారి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ, మండలంలో డెంగీ కేసులు నమోదు అవుతున్న నేపథ్యంలో గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. తాగునీటి ట్యాంకులు క్లోరినేషన్ చేయాలన్నారు. తాగునీటి పైపులు లీకేజీ లేకుండా చూడాలన్నారు. మురుగునీటి కాలువలు శుభ్రం చేసి మలాథిన్ పిచికారీ చేయాలన్నారు. తుంబకుప్పం పీహెచ్‌సీ డాక్టర్ లోహిత్‌చెంగల్‌రాయన్ మాట్లాడుతూ బయట ప్రాంతాల నుంచి వచ్చిన వారిని క్షేత్రస్థాయిలో ఏఎన్ఎంలు, ఆశా, ఎంఎల్‌హెచ్‌పీలు గుర్తించి వారికి ర్యాపిడ్ టెస్టులు నిర్వహించాలని సూచించారు. గ్రామ కార్యదర్శులు, వైద్య సిబ్బంది గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ప్రజాఆరోగ్యం కోసం అందరూ సమన్వయంగా పని చేద్దామన్నారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి పీరూసాహెబ్, శివకుమార్, డాక్టర్ లోకేష్, ఎంపీహెచ్ఈఓ రమేష్ బాబు, హెల్త్ సూపర్‌వైజర్ హరికృష్ణ, గ్రామ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రీన్ అంబాసిడర్లకు జీతాలు ఇవ్వండి



మాట్లాడుతున్న స్వచ్ఛభారత్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి శ్రీరాములు

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలోని పంచాయతీల్లో పనిచేస్తున్న గ్రీన్ అంబాసిడర్ కార్మికులకు పెండింగ్ జీతాలు ఏపీ స్వచ్ఛభారత్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి శ్రీరాములు డిమాండ్ చేశారు. శుక్రవారం చిత్తూరులో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించకపోతే ఆగస్టు 10 నుంచి దీక్షలు చేయనున్నట్లు పేర్కొన్నారు. పని చేయించుకుని వారికి జీతాలు చెల్లించకపోవడం అన్యాయమన్నారు. జీతాలు రాకపోవడంతో కార్మికుల కుటుంబాలు ఇబ్బందులకు గురవుతున్నాయన్నారు. మానవతా దృక్పథంతో ఆలోచించి ప్రభుత్వం స్పందించాలన్నారు. కార్మికులకు ఉద్యోగ భద్రత, గుర్తింపుకార్డులు మంజూరు చేయాలన్నారు. సమావేశంలో నాయకులు నాగరాజు మణి పాల్గొన్నారు.

పట్టించుకోని అధికారులు..

పెండింగ్‌లో ఉన్న గ్రీన్ అంబాసిడర్ జీతాలు వెంటనే చెల్లించాలని ఐఎఫ్‌టీయూ నాయకులు కోరారు. శుక్రవారం డీపీఓ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ పురుషోత్తంకు వినతిపత్రం అందజేశారు. జీతాలు పెండింగ్‌లో ఉన్న అధికారులు, ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రీన్ అంబాసిడర్లు గ్రామాలను శుభ్రం చేస్తూ ప్రజలకు అంటువ్యాధులు వ్యాపించకుండా సేవలు చేస్తున్నారన్నారు. అలాంటి వారికి జీతాలు పెండింగ్ పెట్టడం ఎంతవరకు సబబు కాదన్నారు. 610 జీఓ ప్రకారం రూ.10 వేలకు జీతాలు పెంచాలన్నారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా కార్మికులను మార్చాలని అధికార పార్టీ నాయకులు వేధించడం సరికాదన్నారు. కార్మికులకు పని భద్రత కల్పించి, గుర్తింపుకార్డులు ఇవ్వాలన్నారు. వాహనాలను కార్మికులకు మరమ్మతు చేస్తుంటే వాటికి బిల్లులు ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో నాయకులు సురేంద్రనాథ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు ఇవ్వరా ..?



డ్రైవర్లతో కలిసి నిరసన వ్యక్తం చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

చిత్తూరు అర్బన్: చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో పని చేస్తున్న క్లాప్ (క్లీన్ ఆంధ్రప్రదేశ్) వాహనాలకు డ్రైవర్లుగా పని చేస్తున్న కార్మికులకు పది నెలలుగా వేతనాలు ఇవ్వకుండా వేధించడం ఎంతవరకు సమంజసమని ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షుడు నాగరాజన్ ప్రశ్నించారు. శుక్రవారం కార్పొరేషన్ గ్యారేజీలో క్లాప్ వాహనాల ఎదుట, డ్రైవర్లతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ డ్రైవర్లను నియమించుకున్న రెడ్డిఏజెన్సీ ప్రతినిధులు కార్మికులు చేత పనులు చేయించుకుని పది నెలలుగా వేతనాలు ఇవ్వలేదన్నారు. ఉన్నతాధికారులు కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు మణి, చంద్ర, విజయ్‌కుమార్, రఘు పాల్గొన్నారు.

29న వాహనాల వేలం

కుప్పం రూరల్: కుప్పం సెబ్ స్టేషన్ పరిధిలో మద్యం అక్రమ రవాణా కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను 29వ తేదీ వేలం వేయనున్నట్టు సెబ్ సీఐ సృజన్‌బాబు తెలిపారు. వేలంలో పాల్గొనదలచిన సోమవారం ఉదయం 10 గంటల్లోపు రూ. 5 వేలు చెల్లించి పాసులు తీసుకోవాలన్నారు. వాహనం పొందిన తరువాత అదే రోజు నగదుతో పాటు అదనంగా 18 శాతం జీఎస్టీ కట్టాల్సి ఉంటుందని, వివరాలకు కుప్పం సెబ్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

కృత్రిమ కాళ్ల కొలతల శిబిరానికి స్పందన



శిబిరంలో పాల్గొన్న విభిన్న ప్రతిభావంతులు

చిత్తూరు కలెక్టరేట్: ఉచిత కృత్రిమ కాళ్ల కొలతల శిబిరానికి విశేష స్పందన లభించిందని జిల్లా విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని తపోవనం వద్ద ఉన్న రాస్ భవనంలో ఉచిత కృత్రిమ కాళ్ల కొలతల శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ఉచిత కృత్రిమ కాళ్ల కొలతల కోసం విచ్చేశారన్నారు. నియమ, నిబంధనల ప్రకారం అర్హుల కాళ్ల కొలతలను తీసుకోవడం జరిగిందన్నారు. కొలతలు ఇచ్చి అర్హత ఉన్న వారందరికీ త్వరలో కృత్రిమ కాళ్లను ఉచితంగా అందజేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సావెక్స్ టెక్నాలజీ సంస్థ నిర్వాహకులు, విభిన్న ప్రతిభావంతుల శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ఆర్డీఓ, అధికారులు



హాజరైన అభ్యర్థినులు

పలమనేరు: పలమనేరు రెవెన్యూ డివిజన్‌లోని పలు ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ, మినీ అంగన్‌వాడీల్లోని ఖాళీగా ఉన్న ఆయా పోస్టులకు స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. అందులో బంగారుపాళెం, పుంగనూరు, పలమనేరు, బైరెడ్డిపల్లె, పులిచెర్లలోని ఖాళీ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న 77మంది హాజరయ్యారు. ఎంపికైన వారి వివరాలు త్వరలో ప్రకటించనున్నట్టు ఆర్డీఓ మనోజ్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ నాగశైలజ, డీఎంఅండ్‌హెచ్ఓ హనుమంతరావు, సీడీపీఓలు ఇందిరా ప్రియదర్శిని, రాజేశ్వరి, మాధవిలత, వాణిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం



గుడుపల్లె: గుడివంక శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి కల్యాణోత్సవం శుక్రవారం రాత్రి ఆలయ ఆవరణలో కనుల పండువగా నిర్వహించారు. గుడివంక ఆలయ బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ఆవరణలో పచ్చటి తోరణాలతో పందిళ్లు వేసి, విద్యుద్దీపాల అలంకరణతో కల్యాణ వేదికను శోభాయమానంగా తీర్చిదిద్దారు. అనంతరం ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలతో ప్రత్యేక అలంకరణ చేసి వేదికపై కొలువుదీర్చారు. వేద పండితుల మంత్రోచ్చరణ మంగళవాయిద్యాల హోరు నడుమ వైభవంగా కల్యాణోత్సవం నిర్వహించారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి



మాట్లాడుతున్న ఎస్ఈబీ ఏఎస్పీ సుబ్బరాజు

చిత్తూరు అర్బన్: విద్యార్థులకు చట్టాలపై తప్పనిసరిగా కనీస అవగాహన ఉండాలని చిత్తూరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఏఎస్పీ సుబ్బరాజు సూచించారు. శుక్రవారం చిత్తూరు నగరంలోని ప్రభుత్వ ఐటీఐలో విద్యార్థులకు మత్తు పదార్థాలపై కలిగే పర్యవసనాలు, పోక్సో ఇతర చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏఎస్పీ మాట్లాడుతూ మహిళలకు రాజ్యాంగంలో కల్పించిన చట్టాలను ప్రతిఒక్కరూ గౌరవించాలన్నారు. బాలలపై లైంగిక దాడుల నివారణ కోసం పోక్సో రూపొందించారని తెలిపారు. మహిళల రక్షణ కోసం పోలీసుశాఖ ఎప్పుడూ అప్రమత్తంగా ఉంటుందని, ఫిర్యాదు అందిన వెంటనే ప్రతి స్పందిస్తామన్నారు. గృహహింస నిరోధక చట్టం మహిళల హక్కులకు రక్షణగా నిలుస్తుందన్నారు. సమావేశంలో మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ సుధాకర్‌రెడ్డి, ఎస్ఐ శాంతమ్మ, ఎస్ఈబీ సీఐ విజయ్‌కుమార్, ఐటీఐ ప్రిన్సిపల్ రవీంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలి



వేరుశనగ పంటలో పొలం బడి నిర్వహిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

బైరెడ్డిపల్లె: రైతులు పంటల సాగులో రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించుకుంటే వ్యవసాయం ఖర్చులు తగ్గుతాయని రైతు వనరుల కేంద్రం సహాయ సంచాలకులు నాగపద్మిని అన్నారు. మండలంలోని ఆల్లపల్లె, నాచుకుప్పంలో శుక్రవారం వేరుశనగ పంటలో పొలంబడి కార్యక్రమం నిర్వహించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. విత్తనశుద్ధి, విత్తన మోతాదు, ఎరువుల వాడకం, అంతర పంటలపై నాగపద్మిని అవగాహన కల్పించారు. ప్రస్తుతం వేరుశనగ పంట పూత దశలో ఉండటం వలన జిప్సం ఎకరాకు 200 కేజీలు వాడితే దిగుబడి పెరగడంతో పాటు గింజ నాణ్యత పెరుగుతుందన్నారు. వరి నాటే రైతులు కూడా దుక్కిలో ఎకరాకు 20 కేజీల జింక్ సల్ఫేట్ వాడాలన్నారు. భూసార పరీక్షలను చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖాధికారిణి గీతాకుమారి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

భూసార పరీక్షల ఆధారంగానే ఎరువులు వాడాలి

పలమనేరు: భూసార పరీక్షల ఆధారంగానే పంటల సాగులో ఎరువులను వాడాలని, మితిమీరిన ఎరువుల వాడకంతో భూమి సమతుల్యత దెబ్బ తింటుందని జిల్లా వనరుల కేంద్రం సహాయ సంచాలకులు నాగపద్మిని అన్నారు. శుక్రవారం మండలంలోని కూర్మాయి రైతు సేవా కేంద్రంలో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, వాతావరణ ఆధారిత వ్యవసాయం చేయాలన్నారు. ముఖ్యంగా రైతులు ప్రకృతి వ్యవసాయంపై మక్కువ చూపాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక ఏడీ అన్నపూర్ణదేవి, పలువురు రైతులు పాల్గొన్నారు.